## గవర్నర్‌ను కలిసిన మంత్రి ఫరూక్



నంద్యాల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.

# కాసుల కోసం గోదాములు..!

- వైసీపీ ప్రభుత్వంలో ఊరి చివర నిర్మాణాలు
- రైతుల అవసరాలు తీర్చని వైనం
- నాణ్యత లేకుండానే పూర్తి
- కోట్ల రూపాయలు వృథా



రుద్రవరం మండలంలోని పందిర్లపల్లెలో నిరుపయోగంలో లేని గోదాము



ఇది బనగానపల్లె నియోజకవర్గం కేంద్రంలోని భానుముక్కల పరిధిలో రవ్వలకొండ పైన నిర్మించిన గోదాము. భానుముక్కల పరిధిలోని దాదాపు ఏడు గ్రామాల రైతులు ఉపయోగించుకోవచ్చని దీన్ని నిర్మించారు. ఇందుకోసం గత వైసీపీ ప్రభుత్వం రూ.75 లక్షలు వెచ్చించింది. అయితే రైతులు ఉపయోగించుకోవడానికి వీలు లేకుండా ఊరికి దూరంగా కొండపైన నిర్మించారు.

నంద్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి)



ఇది రుద్రవరం మండలంలోని చందలూరు గ్రామంలో నిర్మించిన గోదాము. దీని నిర్మాణం కోసం వైసీపీ ప్రభుత్వం రూ.75 లక్షలు ఖర్చు చేసింది. ఇంత మొత్తంలో ఖర్చు చేసినా వైసీపీ ప్రభుత్వం ముందు చూపుతో ఆలోచించకుండా గ్రామానికి దూరంగా నిర్మించింది. ఇలా మనుషులు తిరగని ప్రాంతంలో గోదాము కడితే తమ పంట ఉత్పత్తులను ఎలా నిలువ చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం గోదాముల నిర్మాణం పేరిట డబ్బులు నొక్కేసే పనికి తెరతీసింది. రైతులకు అనువుగా లేకుండా ఊరికి దూరంగా కట్టడంతో వీటిని ఉపయోగించుకోలేకపోతున్నారు. ఇక నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో కట్టిన కొన్ని రోజులకే గోదాముల గోడలు పగుళ్లు ఇచ్చాయి. ఈ గోదాములను పరిశీలిస్తే పూర్తిగా వైసీపీ అనుయాయులకు కోట్ల రూపాయలు కట్టబెట్టేందుకు నిర్మించారన్న విషయం స్పష్టమవుతోంది.

గత వైసీపీ ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 255 గోదాములను నిర్మిస్తామని చెప్పింది. వీటిలో 500 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులను నిలువ చేసే గోదాములు, 1000 మెట్రిక్ టన్నలు పంట ఉత్పత్తులను నిలువ చేసే గోదాముల నిర్మాణాలను చేపట్టింది. వీటిని నిర్మించే సమయంలో ఆయా గ్రామాల రైతులకు ఉపయోగపడతాయా? వారి పంటల రవాణాకు అనువుగా ఉంటాయా? అనేది ఏమాత్రం ఆలోచించలేదు. ప్రస్తుతం 45 మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. ఇవి కూడా ఊళ్లకు దూరంగా వాగులు, వంకల పక్కన ఉండటం వల్ల రైతులు ఉపయోగించుకోలేకపోయారు. దీంతో నిర్మాణాలు పూర్తయినా గోదాములు నిరుపయోగంగా పడి ఉన్నాయి.

మిగతా 7లో...

## అక్రమ నిర్మాణాలను అడ్డుకునేదెవరు..?

- మామూళ్ల మత్తులో ప్లానింగ్ విభాగం
- అక్రమ వసూళ్లపైనే అధికారులు, సిబ్బంది దృష్టి
- కర్నూలు కార్పొరేషన్ ఆదాయానికి గండి
- అవినీతి అక్రమాలపై కొనసాగుతున్న విచారణ



కర్నూలు న్యూసిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళికా విభాగంలో అవినీతి పెచ్చుమీరింది. నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో అనధికార భవన నిర్మాణాలు సుమారు వెయ్యికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి భవనాలే ప్లానింగ్ విభాగంలోని అధికారులు, సిబ్బందిగా వరంగా మారాయి. ప్లానింగ్ సెక్రటరీల నుంచి ఉన్నతాధికారుల వరకు అవినీతికి పాల్పడటంతో అనుమతి తీసుకోకుండా భవనాలు నిర్మిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

**● ఆదాయానికి గండి....**

నగర పాలక సంస్థలోని ప్రణాళికా విభాగంలో ఉన్న ఆదాయ వనరులు పక్కదోవ పడుతున్నాయి. అధికారులు, సిబ్బందితోపాటు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు చేతివాటం ప్రదర్శించడంతో కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతోంది. ప్రధానంగా భవన నిర్మాణ అనుమతుల రుసుం, ప్రకటనల పన్ను, అక్రమ నిర్మాణాల రుసుము వసూళ్లలో నిర్లక్ష్యం, చేతివాటం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కాగా 2019 నుంచి నయా పైసా రుసుం వసూలు చేయకపోవడం విభాగపు పని తీరును ప్రశ్నిస్తోంది. ఉన్నతాధికారుల అండదండలతో కొందరు ఉద్యోగులు, సిబ్బంది డబ్బు ఇచ్చిన వారికి మాత్రమే అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఇవ్వని వారి భవనాలను కూల్చేస్తున్నారు.

**● ప్లానింగ్ సెక్రటరీల హవా..**

సచివాలయ వ్యవస్థలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్లానింగ్ సెక్రటరీ ఉంటారు. ఈ క్రమంలో కొందరు అధికారులు ప్లానింగ్ సెక్రటరీలను అడ్డం పెట్టుకుని డబ్బులు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సచివాలయ వ్యవస్థ రాకముందు నూతన భవన నిర్మాణానికి అనుమతులు కావాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకునే వారు. ప్రస్తుతం సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న తరువాత ప్లానింగ్ సెక్రటరీ అందుకు సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేసి స్థలాన్ని పరిశీలించిన అనంతరం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్/అసిస్టెంట్ సిటీ ప్లానర్‌కు నివేదికలను పంపుతారు. ఈ తతంగమంతా పూర్తి కావాలంటే కనీసం నెల రోజులు పడుతుంది. అయితే దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించి వారి స్థలంలో ఏవైనా లోపాలు ఉంటే అధికారులు ప్లానింగ్ సెక్రటరీల ద్వారా స్థల యజమానికి సమాచారం చేరవేస్తారు. ఎంతో ఒకంత ముట్టజెప్పాలని, లేని పక్షంలో అనుమతి నిరాకరిస్తారని భయపెడతారు. దీంతో కొందరు స్థల యజమానులు డబ్బులు ముట్టజెప్పి తమ పనులు చేయించుకుంటున్నారు. ప్రతి రోజూ కనీసం 10 నుంచి 20 దాకా భవనాలకు అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఒక్కో భవనానికి సుమారు రూ.20 వేల నుంచి రూ.లక్ష దాకా వసూలు చేస్తున్నారు. వీటితోపాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వేసే వెంచర్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులకు సంబంధించి అధికారులకు పెద్ద మొత్తంలో డబ్బులు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మిగతా 6లో...

## శ్రీశైలం పాదయాత్రికులకు అటవీశాఖ అడ్డంకులు

బైర్లూటి చెక్ పోస్టు నుంచి వెళ్లనివ్వకుండా ఆంక్షలు



బైర్లూటి చెక్‌పోస్టు వద్దకు ఆటోల్లో చేరుకున్న శ్రీశైల పాదయాత్రికులు

ఆత్మకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులకు అటవీశాఖ అధికారులు మళ్లీ అడ్డంకులు సృష్టించారు. బైర్లూటి చెక్‌పోస్టు మీదుగా పాదయాత్రగా వెళ్లేందుకు అనుమతించలేదు. ఈ విషయం హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధుల దృష్టికి వెళ్లడంతో వారి జోక్యం మేరకు అటవీ అధికారులు పాదయాత్రికులకు అనుమతిచ్చారు. పాములపాడు మండలంలోని పాములపాడు, ఇస్కాల, కంబాలపల్లి గ్రామాలకు చెందిన సుమారు 200 మందికి పైగా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైలానికి కాలినడకన వెళ్తుండగా బైర్లూటి చెక్‌పోస్టు వద్ద అటవీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. భక్తులు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తామని చెప్పడంతో దిగివచ్చిన అటవీ అధికారులు బైర్లూటి చెక్‌పోస్టు నుంచి వెళ్లేందుకు అనుమతించారు.

## టిప్పర్లను అడ్డగించిన గ్రామస్థులు



పాములపాడులో హైవేపై టిప్పర్లను అడ్డగించిన గ్రామస్థులు

పాములపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో నేషనల్ హైవే పనులు చేస్తున్న టిప్పర్లను గ్రామస్తులు అడ్డగించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ టిప్పర్లు అధిక లోడుతో మట్టి, కంకర తరలిస్తుండటంతో పాములపాడు నుండి చెలిమిళ్ళ వెళ్లే రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలో రేయింబవళ్ళు టిప్పర్లు తిరుగుతుండటంతో మట్టి, దుమ్ము ఇళ్ళలో, దుకాణాలలోకి దుమ్ము వస్తుండంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. కంబాలపల్లి గ్రామంలో ఈ అధికలోడు వాహనాల రాకపోకలతో తాగునీటి పైప్ పగిలిపోయిందన్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

# ఆ రెండింటిని రాజధానికి మార్చుతాం

- అమరావతికి లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్..!
- అందుకు వీలుగా చట్ట సవరణ చేస్తాం
- కోర్టుకు స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కర్నూలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ లోకాయుక్త సంస్థ, ఏపీ మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) కర్నూలు నుంచి అమరావతికి తరలించనున్నారా..? రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో బుధవారం జరిగిన విచారణలో అమరావతిలోనే ఈ రెండు ఉంటాయని ప్రభుత్వం తరుపు న్యాయవాది స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా చట్ట సవరణ చేస్తామని కోర్టుకు వివరించారు. అంటే.. ఏ క్షణమైనా ఏపీ లోకాయుక్త సంస్థ, ఏపీ మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ)లు కర్నూలు నుంచి తరలిపోయే అవకాశం ఉందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే.. కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన వీటిని ఇక్కడే ఉంచాలని, కొత్త సంస్థలను తీసుకు రావడం దేవుడెరుగు.. ఉన్న సంస్థలను తరలించడం ఎంతవరకు భావ్యమని న్యాయకోవిదులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే జాతీయ న్యాయ విద్యా కళాశాల విజయవాడలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తాజాగా ఈ రెండింటిని కూడా తరిలించేందుకు చట్ట సరవణ చేస్తామని సాక్షాత్తు హైకోర్టుకే తెలిపారంటే.. ఎప్పుడైనా తరలిపోయే అకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఏపీ హెచ్‌ఆర్‌సీ, ఏపీ లోకాయుక్త సంస్థల తరలింపుపై మద్దిపాటి శైలజ, ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ హైకోర్టులో దాఖాలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాది ప్రభుత్వ ఆలోచన విదానం న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.

● రాష్ట్ర విభజన తరువాత కొలుదీరిన టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర రాజధానిగా అమరావతిని గుర్తించింది. రాజధాని నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా దాదాపు 33 వేల ఎకరాలు సేకరించారు. సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు సహా రాష్ట్ర ప్రధాన సంస్థలు అన్నింటిని కూడా అమరావతిలో ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు సారథ్యంలోని ఆనాటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో హైదరాబాద్ నుంచి ఒక్కొక్కటిగా కార్యాలయాలు అమరావతికి తరలిస్తూ వచ్చారు. 2019లో జగన్ సారథ్యంలో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల అంశం తెరపైకి తీసుకొచ్చింది. అందులో భాగంగా కర్నూలు న్యాయ రాజధానిగా ప్రకటించారు. అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారు.

మిగతా 6లో...

మల్లేవేముల గ్రామ సమీపంలో నీట మునిగిన వేరుశనగ పంట



## పంటలను ముంచెత్తిన కేసీ నీరు

- కాలువలు దెబ్బతినడమే కారణం
- పూర్తి కాని మరమ్మతు పనులు
- పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులు



కేసీ కాలువ నుంచి కుంటలోకి ప్రవహిస్తున్న నీరు

చాగలమర్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో కేసీ పంట కాలువలు దెబ్బతినిపోవడంతో పొలాల్లోకి నీరు ప్రవహిస్తోంది. గొట్లూరు గ్రామ సమీపంలోని కేసీ డిస్ట్రిబ్యూటరీ నుంచి పంట కాలువకు నీరు విడుదల చేశారు. గ్రామ శివార్లలో పంట కాలువలు దెబ్బతినిపోవడంతో, కాలువ పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేయడంతో కేసీ నీరు పొలాల్లో ప్రవహించి పంటలను ముంచెత్తాయి. మల్లేవేముల గ్రామానికి చెందిన రైతులు స్వామిరెడ్డి, నరసింహారెడ్డి, చంద్ర, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మరి కొందరు రైతులకు చెందిన 50 ఎకరాల దాకా నీట మునిగాయి. వేరుశనగ, మినుము, నువ్వు, మొక్కజొన్న పంటలు చేతికి వచ్చే దశలో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ నీటికి ఇసుక సంచులు అడ్డం వేసి సమీపంలోని కుంటల్లోకి నీరు మళ్లించారు. ప్రతి ఏడాది కేసీ నీటితో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోయారు. . పంట కాలువ పనులు దెబ్బతినిపోవడం, మరమ్మతు పనులు పూర్తి చేయకపోవడంతో కేసీకి నీరు విడుదల చేయగానే పంట పొలాల్లోకి ప్రవహించి నష్టపోతున్నామని రైతులు విలపించారు. అధికారులు స్పందించి పంట నష్టం అంచనా వేసి పరిహారం అందించాలని, ఈ ఏడాదైనా కేసీ పంట కాలువ పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరారు.



# తుంగా తీరం.. నీలి వర్ణం..



బుధవారం ఉదయం 6:30 గంటలకు మంచుతో నిండుకున్న తుంగభద్ర నదీ పరివాహకం

ప్రశాంత తుంగభద్ర అందాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. ఉధృతంగా ఉరకలెత్తినా... రాష్ట్రాలు దాటి ఒంపుసొంపులతో ప్రవహించినా.. కావేవీ అందాలకు అనర్హం అన్నట్టు అగుపిస్తుంది తుంగభద్ర నది. బుధవారం సూర్యోదయానికి కొన్ని నిమిషాల ముందు ఇలా అందాల నీలివర్ణం తుంగభద్రను కమ్మేసింది. తర్వాత 6 గంటలపైన నీలివర్ణం కనుమరుగై మంచుదుప్పటి కప్పేసిన ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి 'క్లిక్' మనిపించింది. నిత్యం బిజీగా ఉండే నగర ప్రజలు కర్నూలుకు మణిహారంగా ఉన్న ఈ నది అందాలను తెల్లవారుజామున తనివితీరా ఆస్వాదిస్తున్నారు.

- కర్నూలు రూరల్



# బృందా తులసి వనం



- రాఘవరాయడికి ఇష్టమైన తులసి పూజ
- మూడు ఎకరాల విస్తీర్ణంలో సాగు
- శ్రీమఠంలో నిత్య పూజల్లో వినియోగం



తుంగభద్ర నది ఒడ్డున సాగు చేస్తున్న తులసి వనం

**మంత్రాలయం రాఘవేంద్రస్వామికి తులసి లేనిదే పూజ లేదు. హిందువులు పరమపవిత్రంగా భావించే తులసి, బిల్వపత్రాలతో రాఘవరాయలకు పూజలు నిర్వహిస్తారు. మంత్రాలయంలో దాదాపు మూడెకరాల్లో ఐదు చోట్ల తుంగభద్ర నదితీరం.. బృందావన్ గార్డెన్ గెస్టు హౌస్, సంస్కృత పాఠశాల, గురునివాస్, పూర్వపు పీఠాధిపతుల బృందావనాల దగ్గర, వెంకటేశ్వరస్వామి గుడి వద్ద తులసి మొక్కలను విస్తారంగా పెంచుతున్నారు. ఇందుకు 21 మంది కూలీలను కేటాయించారు. సేంద్రియ రసాయనిక ఎరువులు కాకుండా సంప్రదాయ ఎరువులతో తులసివనం సాగు చేస్తున్నారు. ఎంతో నిష్ట, నియమ భక్తితో రాఘవేంద్రస్వామికి నిత్యం కిలోల తులసిదళాలతో పూజలు నిర్వహిస్తారు.**

**మంత్రాలయం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** తులసిని రెండు రకాలుగా పిలుస్తారు. ఒకటి రామతులసి.. మరొకటి కృష్ణ తులసి. మంత్రాలయంలో రామతులసిని సాగు చేస్తున్నారు. ఈ వనంలోకి ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన రక్షణ నడుమ సాగు చేస్తున్నారు. ఈ తులసిలో అనేక ఔషధగుణాలు ఉంటాయి. సర్వరోగ నివారణిగా పిలిచే ఈ మొక్కలను దేవాలయాలు, ఇంటి ముందు, ఇంటి పెరటిలో పెంచుతుంటారు. హిందువులు దైవంగా భావించి కొలుస్తూ పూజలు చేస్తారు. పావని, సురభి పేర్లుగా తులసికి నామకరణం ఉంది. మంత్రాలయం రాఘవేంద్రస్వామి నిజ బృందావనానికి తులసి అర్చన సేవ, మూలరాముల పూజ, ఏకాదశి రోజున పూర్వపు పీఠాధిపతుల బృందావనాలకు తులసి మాల సమర్పణ చేస్తారు. తులసి కాండం, వేర్లు, తులసిమాలలు, హోమాల్లో కాండాలను ఉపయోగిస్తారు. దేవతార్చన సమయంలో ఒక్క తులసి పత్రం సమర్పిస్తే అనంత పుణ్యకోటి ప్రాప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం.

## తులసిమాలలకు ప్రసిద్ధి మంత్రాలయం

మంత్రాలయంలో తులసి కాండలు, వాటి కొమ్మలతో తులసిపూసలు తయారు చేస్తారు. దాదాపు 5 కుటుంబాలు తులసిపూసలు, మాలలు తయారు చేసి భక్తులకు అందుబాటులో ఉంచుతారు. భక్తుల విజ్ఞప్తి మేరకు బంగారు, వెండి, రాగి, ఇత్తడి, దారంతో ఒరిజినల్ తులసి పూసలు లభ్యమవుతాయి. తులసిమాలలు మెడలో ధరించడం వల్ల సువాసనతో పాటు వ్యాధినిరోధక శక్తిగా ఉపయోగపడుతుంది. కర్నూలు జిల్లాలో ఎక్కడా లేనంతగా మూడెకరాల్లో తులసి వనంను మంత్రాలయంలో నదితీరం, ఆహ్లాదకరమైన, స్వచ్ఛ సుందరమైన ప్రదేశాల్లో పెంచుతున్నారు.





### తులసి తీర్థం పవిత్రం

తులసి తీర్థం పవిత్రమైనది. ఏడాది పాటు తులసి పూజ చేస్తే సర్వరోగాలు నివారణ అవుతాయని నమ్మకం. శ్రీకృష్ణునికి, శ్రీమహావిష్ణువుకి అత్యంత ప్రీతిపాత్రమైనది తులసి. మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు, బృందావనాలకు నిత్యం తులసి అర్చన, పూజలు చేస్తారు. తులసి లేనిదే స్వామివారికి పూజ లేదు.

-సుబుదేంద్రతీర్థులు, పీఠాధిపతి, మంత్రాలయం



### మూడెకరాల విస్తీర్ణంలో సాగు

- ఎల్.మాధవశెట్టి, ఏఏవో,

మంత్రాలయంలో పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు అత్యంత పవిత్రమైన స్థలంలో మూడెకరాల్లో తులసి వనాన్ని ఏర్పాటు చేశాం. 20 మంది కూలీలతో ఎటువంటి రసాయనక ఎరువులు, పిచికారి మందులు వాడకుండా సేంద్రియ ఎరువులతోనే, ప్రకృతికి అనుగుణంగా సాగు చేస్తున్నాం. భక్తులకు, ఇతరులకు తులసివనంలోకి అనుమతులు ఉండదు. నియమ నిష్ఠలతో పవిత్ర తులసి వనం సాగు చేస్తున్నాం. ప్రతిరోజు స్వామివారికి దాదాపు ఆరు కిలోల తులసి దళాలతో పూజలు చేస్తారు. పూర్వపు పీఠాధిపతుల బృందావనాలతో పాటు రాఘవేంద్రస్వామికి, మంచాలమ్మకు, వెంకటేశ్వరస్వామికి, సంస్థాన పూజలకు తులసి వినియోగిస్తున్నాం.



తులసి మొక్కలతో తయారైన వెండి తులసి మాలలు



తులసి కాండంతో మాలలు తయారు చేస్తున్న శిల్పులు

# మృతదేహాలే మొదటి గురువులు

- వైద్య విద్యార్థులకు కేడావరిక్ ఓథ్



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ

**కర్నూలు హాస్పిటల్ 13(ఆంధ్రజ్యోతి):** వైద్య విద్యార్థులకు మృతదేహాలే మొదటి గురువులని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్. చిట్టినరసమ్మ అన్నారు. బుధవారం అనాటమీ విభాగంలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులకు మృతదేహంపై ప్రమాణం(కేడావరిక్ ఓథ్)నిర్వహించారు. 250 మంది విద్యార్థులు పాల్గొనే కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శరీరంలో ప్రతి అవయవాన్ని గురించి తెలుసుకోవాలని, మృతదేహాన్ని తప్పక గౌరవించాలని అన్నారు. వైద్య విద్యార్థులు మృతదేహంపై ప్రాక్టికల్స్ నిర్వహించాలని, మానవ శరీరంలోని అంతర్గతంగా ఏఏ భాగాలు ఎక్కడ ఉంటాయి.. ఎలా ఉంటాయో నేరుగా చూడటం జరుగుతుందన్నారు. మరణించినా కూడా వైద్య విద్యార్థులకు పాఠాలు నేర్పుతున్న మృతదేహానికి వారి కుటుంబ సభ్యులను గౌరవించి కృతజ్ఞత తెలపాల్సిన బాధ్యత వైద్యులు, విద్యార్థులపై ఉందన్నారు. అందుకే మొదటి సంవత్సరం విద్యార్థుల చేత కేడావరిక్ ఓథ్ కింద ప్రమాణం చేయించామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ సాయి సుధీర్, హరిచరణ్, రుణుకాదేవి, విజయానంద బాబు అనాటమీ హెచ్ఓడీ పి.శోభారాణి, అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



# సైలెంట్ కిల్లర్



- ఏటా పెరుగుతున్న మధుమేహ బాధితులు
- పట్టణాల్లో 50 శాతం
- నేడు వరల్డ్ డయాబెటిక్ డే

**చక్కెర వ్యాధి ఆరోగ్యాన్ని మెల్లగా ధ్వంసం చేస్తుంది. అనేక ఇతర వ్యాధులు తీవ్రమయ్యేలా చేస్తుంది. ఒకప్పుడు 50 ఏళ్ల తర్వాత వచ్చే మధుమేహం ఇప్పుడు జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వల్ల 20 నుంచి 30 ఏళ్ల వాళ్లకు కూడా వస్తున్నది. మధుమేహంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అంతర్జాతీయ మధుమేహ సమాఖ్య 2006 నుంచి వరల్డ్ డయాబెటిక్ డేను నిర్వహిస్తోంది. 1972లో సర్ ఫ్రెడరిక్ బాంటింగ్ ఇన్సులిన్ కనిపెట్టడంతో ఆయన పుట్టిన రోజు నవంబరు 14న వరల్డ్ డయాబెటిక్ డేగా జరుపుకుంటున్నారు.**

**కర్నూలు హాస్పిటల్ 13(ఆంధ్రజ్యోతి):** డయాబెటిక్ వ్యాధి ఇటీవల చాలా తీవ్రమైంది. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లో అధికంగా షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. పట్టణాల్లో 50 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 15 శాతంగా కనిపిస్తున్నది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ ఓపీ వారంలో మంగళ, శుక్రవారాల్లో ఉంటుంది. ప్రతి వారం 700 మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు వస్తున్నారు. ఇందులో టైప్-1 బాధితులు, చిన్నారులు 100 మంది ఉండగా.. మిగిలిన రోగులు 600 మంది టైప్-2 ఉన్నారు. ఇందులో టైప్-1 బాధితులకు ఎండోక్రైనాలజీ విభాగం నెలకు ప్రతి రోగికి రెండు వైల్స్ ఇవ్వగా.. టైప్-2 రోగులకు మందులను ఉచితంగా అందిస్తున్నది. 20 పడకల సామర్థ్యం ఉన్న ఎండోక్రైనాలజీ విభాగం ప్రతి వారం 10 నుంచి 15 మంది అడ్మిషన్ పొందుతుంటారు.

**షుగర్ స్థాయి ఎలా ఉండాలంటే:**

- మన శరీరంలో చక్కెర స్థాయి పడగడుపున తినక ముందు 100 కన్నా తక్కువ ఉంటే మధు మేహం లేన ట్లుగా భావిం చాలి. 126 పైన ఉంటే షుగర్ వ్యాధి ఉన్నట్లు గుర్తించి వైద్యులను సంప్రదించాలి.



- తిన్న రెండు గంటల తర్వాత చక్కెర స్థాయిలు 140లోపు ఉంటే నార్మల్. 140 నుంచి 199 చక్కెర స్థాయి ఉంటే ప్రి డయాబెటిక్ ఉన్నట్లు భావించి జాగ్రత్తలు తీసుకోవాలి.
- తిన్న తర్వాత చక్కెరస్థాయి 200 దాటితే షుగర్ ఉన్నట్లుగా చెప్పవచ్చు.
- మూడు నెలల చక్కెర స్థాయి 7 శాతం కంటే తక్కువ ఉండేలా చూడాలి. 5.6 నుంచి 6.4 శాతం ఉంటే ప్రిడయాబెటిక్, 6.5 శాతం ఉంటే షుగర్ ఉన్నట్లు చెప్పవచ్చు.
- తెల్ల అన్నం మహా ప్రమాదం: చక్కెర వ్యాధిగ్రస్థులు పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోవాలి. వరి అన్నం తింటే చక్కెర స్థాయిలు విపరీతంగా పెరుగుతాయి. బ్రౌన్ రైస్, చిరుధాన్యాలు తినాలి. డయాబెటిక్ ఉన్న రోగులు సీతాఫలం, మామిడి, సపోట పండ్లు తినకూడదు. ఆపిల్, బొప్పాయ, దానిమ్మ, చీని పండ్లను తినవచ్చు.
- జిల్లాలో 1.44 లక్షల రోగులు: వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన ఎన్‌సీడీ సర్వేలో జిల్లాలో 1.44 లక్షల మంది మధుమేహ రోగులు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఏడాది జనవరిలో ఎన్‌సీడీ ఇంటింటి సర్వేలో రోగులను గుర్తించారు.

### ● నేడు నర్సులకు అవగాహన సదస్సు



వరల్డ్ డయాబెటిక్ డేను పురస్కరించుకుని కర్నూలు జీజీహెచ్ ఎండోక్రైనాలజీ విభాగం హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులకు అవగాహన సదస్సును గురువారం ఉదయం ఓల్డ్ సీఎల్‌జీలో ఏర్పాటు చేశాం. రోగికి చికిత్స అందించడంలో వైద్యుల తర్వాత ఆ స్థానం నర్సులదే. అందుకే షుగర్ రోగులకు ఇన్సులిన్ ఎంత మోతాదులో ఇవ్వాలి.. మందులు ఎలా ఇవ్వాలి.. అనే చికిత్స విధానాలను వివరించనున్నాం.

- డా.పి. శ్రీనివాసులు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, ఎండోక్రైనాలజీ విభాగం, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి

### ● చివరి దశలో వస్తున్నారు



చాలా మంది షుగర్ వ్యాధితో కిడ్నీలు డ్యామేజ్ అయ్యాక, నరాల బలహీనత, పక్షవాతం, గుండె జబ్బులకు గురయ్యాక వస్తుంటారు. మధుమేహం ఉన్న వారు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలి. శరీరంలోని షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోవాలి.

- డా. మీనుగ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, కర్నూలు జీజీహెచ్

### ● షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలి



శరీరంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవాలంటే వైద్యుల పర్యవేక్షణలో మందులు సక్రమంగా వాడాలి. కనీసం మూడు నెలలకోసారి వైద్యులను సంప్రదించాలి. చాలా మంది ఒకసారి పరీక్షలు చేయించుకుని ఏళ్ల తరబడి అవే మందులు వాడుతుంటారు. అలా చేస్తే వ్యాధి అదుపులో ఉండదు.

- డా.బి. భరత్, ఎండోక్రైనాలజిస్టు, కర్నూలు

# అక్రమ నిర్మాణాలను అడ్డుకునేదెవరు..?

(5వ పేజీ తరువాయి)

నగరంలో వ్యాపార వాణిజ్య ప్రకటనల పన్ను వసూళ్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. గోడలపై రాతలు, ఫ్లెక్సీలు, ఇతరత్రా ప్రకటనలు, ప్రచారాలు చూసీ చూడనట్లు వదిలి వేస్తున్నారు. దీని ద్వారా సంస్థ ఆదాయానికి భారీ స్థాయిలో నష్టం వాటిల్లుతోంది. ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి అక్రమ వసూళ్లు అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపడితే కార్పొరేషన్ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

**అనధికార వసూళ్లు:**

లైసెన్స్‌డ్ సర్వేయర్లు స్ట్రక్చరల్ ఇంజనీర్ల పేర్ల నమోదు వారి లైసెన్స్‌ల రెన్యువల్‌కు సంబంధించి సిబ్బంది ఇష్టానురాజ్యంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. వీరు ప్రతి ఏటా తమ పేర్లు రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే కొత్తగా రెన్యువల్ ఫీజులు చెల్లించకుండా పాత ఏడాది అనుమతులతోనే పనులు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఒక్కో లైసెన్స్‌కు రూ.30 వేల దాకా మామూళ్లు తీసుకుంటున్నట్టు సమాచారం. సిబ్బందికి వ్యక్తిగతంగా ప్రయోజనం చేకూరుతుందే తప్ప కార్పొరేషన్‌కు మాత్రం ఆదాయం సమకూరడం లేదు.

**● కొనసాగుతున్న విచారణ..**

నగరానికి చెందిన ఓ వ్యక్తి పట్టణ ప్రణాళికా విభాగంలో అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలు చేస్తున్న అవినీతి అక్రమాలపై నేరుగా సీఎంకు లేఖ రాశారు. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు రీజినల్ డైరెక్టర్ ఐదుగురు సభ్యులత కూడిన ఓ కమిటీని నియమించారు. ఇందులో చిత్తూరు మున్సిపల్ కమిషనర్ పి.నరసింహప్రసాద్, రాయదుర్గం కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, తిరుపతి డిప్యూటీ సిటీ ప్లానర్ మహాపాత్రో, ఆదోని మున్సిపాలిటీ రెవెన్యూ ఆఫీసర్ కేఎండీ నాసిర్, అనంతపురం ఆర్‌డీడీటీపీలో పని చేస్తున్న టీపీఏ ఓంకార్‌లు ఉన్నారు. డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్యారాణి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు శబరీష్, మంజులమ్మలతో పాటు వార్డు ప్లానింగ్ సెక్రటరీలో బీఎండీ రఫిక్ బాషా, వి.దివ్య, ఎస్.రూప, ఎం.రంగానథ్, ఉప్పెన నవీన్‌కుమార్‌లను కమిటీ సభ్యులు విచారిస్తున్నారు. ఇప్పటికే ప్లానింగ్ సెక్రటరీలను విచారించారు. తదుపరి అధికారులను విచారించనున్నారు. ఈ నెల 15వ తేదీలోగా విచారణ పూర్తి చేసిన నివేదికలను ఆర్‌డీఎంఏకు పంపాలని ఆదేశాలు అందాయి. ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులంతా ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు.

# ఆ రెండింటిని రాజధానికి మార్చుతాం

(5వ పేజీ తరువాయి)





న్యాయ శాఖకు సంబంధించిన సంస్థలను కర్నూలులో ఏర్పాటుకు వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే తాత్కాలిక భవనం స్టేట్ గేస్ట్ హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సీ) ఏర్పాటు చేశారు. హైదరాబాద్ - బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారి పక్కనే సంతోష్ నగర్‌లో ఏపీ లోకాయుక్త సంస్థను అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. దిన్నెదేవరపాడులో శాశ్వత భవనంలో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఏర్పాటు చేశారు. ఎన్నికల ముందు నగర శివారులో జగన్నాథ గట్టుపై జాతీయ న్యాయ విద్యా కళాశాల నిర్మాణానికి అప్పటి సీఎం జగన్ హడావుడిగా శంకుస్థాపన చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక జాతీయ న్యాయ విద్యా కళాశాలను విజయవాడలో ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అక్కడ మరో కళాశాల ఏర్పాటు చేస్తారా..? కర్నూలులో శంకుస్థాపన చేసిన కళాశాలనే తరలిస్తారా..? అన్నది స్పష్టత ఇవ్వలేదు. గత రెండు మూడేళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్న ఏపీ లోకాయుక్త సంస్థ, ఏపీ మానవ హక్కుల కమిషన్‌లను మాత్రం ఇక్కడి నుంచి తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు స్పష్టం అవుతోంది. ఏపీ లోకాయుక్త, హెచ్ఆర్‌సీలను విజయవాడ తరలిస్తే ఆ సంస్థల్లో ఎలాంటి ఫిర్యాదులు చేయాలన్నా దాదాపు 400 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సిందే. రాయలసీమ జిల్లాల ప్రజలకు అది సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ రెండు సంస్థలను ఇక్కడే కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

# సహకార వారోత్సవాలను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** 71 వ అఖిల భారత సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో సహకార వారోత్సవాల వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా సహకార రంగాల అభివృద్ధి, సంఘాల విజయాలను తెలియపరిచేలా 14 నుండి 20 వ తేదీ వరకు వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య, డ్వామా పీడీ జనార్దన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# అలా వదిలేశారు..!

సగం కూలి ప్రమాదకరంగా ఉన్న భవనాన్ని చూడండి. హొళగుంద మండలం సమ్మతగేరిలోని ప్రాథమిక పాఠశాలను ఒకప్పుడు ఇందులో నిర్వహించేవారు. కొన్నేళ్ల క్రితం ఈ పాఠశాలకు నూతన భవన నిర్మాణం పూర్తి కావడంతో అక్కడకు మార్చారు. అయితే పాత పాఠశాల భవనం మాత్రం ఇలా సగం కూలి ప్రమాదకరంగా తయారైంది. రహదారి పక్కనే ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం ప్రజల్లో నెలకొంది. మరెమ్మ అవ్వ దేవాలయం పక్కనే ఉండడంతో భక్తులు, ఈ భవనం పక్క నుండే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ భవనం ఎప్పుడు కూలుతుందో, ఎవరికి ప్రమాదం వాటిల్లుతుందో అని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

-హొళగుంద



# ఇలా వెళ్లిపోతున్నారు..!



ఈ ఏడాది వలసలు పెరిగిపోతున్నాయి. గ్రామాల్లో కూలి పనులు లేవు. అధికారులు సైతం ఉపాధి పనులు చూపించడంలో విఫలమయ్యారు. కల్పించిన పనులకు సకాలంలో కూలి డబ్బులు ఇవ్వడం లేదు. ఇక చేసేదేమీ లేక ప్రజలు వలసబాట పడుతున్నారు. గోనెగండ్ల మండలం నుంచి వారం రోజులుగా వలస బండ్లు కదులుతున్నాయి. బుధవారం అలువాల, కులుమాల, గంజహళ్లి గ్రామంలో నుంచి దాదాపు 200 మంది కూలీలు తెలంగాణకు వలస వెళ్లారు. అక్కడ పత్తి పొలాల్లో, పట్టణాల్లో సిమెంట్ పనులు చేసేందుకు పయనమయ్యారు.

-గోనెగండ్ల



# జ్ఞాన భాండాగారం..
# గ్రంథాలయం

- పాఠకులకు విస్తృత స్థాయిలో సేవలు
- నేటి నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం

**కర్నూలు కల్చరల్/కొలిమిగుండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఉద్యమకారులకు సమాచార కేంద్రాలుగా ఉంటూ అక్షరాస్యత సాధనలో ప్రముఖ పాత్ర పోషించిన ఘనత గ్రంథాలయానికే చెందు తుంది. నేటి ఆధునిక కాలంలోనూ పాఠకులకు విస్తృత స్థాయిలో సేవలందిస్తున్న ఈ పఠనాలయాలను గుర్తిస్తూ ఏటా నవంబరు 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పత్తికొండ, నంద్యాల, చాగలమర్రి తదితర ప్రాంతాల్లో నాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిల్చడంలో గ్రంథాలయాలు ప్రముఖంగా నిలిచాయి. స్వాతంత్ర్యానంతరం కర్నూలు నగరంలోని పాతనగరం గడియారం ఆసుపత్రి వద్ద గ్రంథాలయ సంస్థను, జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని 1959లో స్థాపించారు. వీటిని ఆనాడు ఎల్ఎల్ఏ (లోకల్ లైబ్రరీ అథారిటీ) సంస్థ నిర్వహించేది. కాగా 1972లో ప్రస్తుతం చిదంబరరావు వీధిలో ఉన్న సొంత భవనంలోకి మార్చారు. ఎల్ఎల్ఏ నుంచి గ్రంథాలయాలను రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ పరిధిలోకి చేర్చారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థగా పేరు మారింది. గత 64 ఏళ్లుగా జిల్లా కేంద్ర గ్రంథాలయం పాఠకులకు విస్తృత సేవలందిస్తోంది. గురువారం నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయ సంస్థ అందిస్తున్న సేవలపై ప్రత్యేక కథనం.

## అందుబాటులో లక్షలాది పుస్తకాలు



కర్నూలు జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీతో కలుపుకొని 58 శాఖా గ్రంథాలయాలు, 1 గ్రామీణ గ్రంథాలయం, 133 పుస్తక నిక్షిప్త కేంద్రాలు (బీడీసీ)లతో సేవలు అందిస్తున్నాయి. తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ ఇతర భాషలకు సంబంధించిన 55,169 పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంటు న్నాయి. ఒక్క జిల్లా కేంద్రంలోనే పత్రికలు, రెఫరెన్స్, లెండింగ్ (పుస్తకాలు ఇంటికి ఇవ్వడం), ఇంటర్‌నెట్, సెర్చ్, స్టడీల్యాబ్ వంటి ఆరు విభాగాల్లో సేవలు అందిస్తోంది. జిల్లాలో 21 శాఖా గ్రంథాలయాలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా, 22 అద్దె ప్రాతిపదికన, 17 రెంట్ ఫ్రీ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి.

## నిరుద్యోగుల పోటీ పరీక్షలకు..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగ యువత వివిధ పోటీ పరీక్షలు రాసేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. పుస్తక పఠనం కోసం ఏసీ స్టడీ హాలు అందుబాటులో ఉండగా సుమారు వందమంది కూర్చొని చదువుకునే అవకాశం లైబ్రరీలో ఉంది. స్టడీ హాలులో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నిరుద్యోగులు చదువుకునే ఏర్పాటు చేశారు. పాఠకుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంతోపాటు కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, గోస్పాడు, ఆదోని, పాణ్యం, ఆలూరు, డోర్నిపాడు, నంద్యాల, డోన్, నందికొట్కూరు శాఖా గ్రంథాలయాల్లో అంతర్జాల సౌకర్యం కల్పించారు.

### గ్రంథాలయ సెస్ నిధులు విడుదల చేస్తే మరిన్ని సేవలు



జిల్లా గ్రంథాలయ సంస్థకు నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి రావాల్సిన సెస్ నిధులు 13 కోట్లకు పైగా ఉన్నాయి. గ్రంథాలయ సంస్థ రుసుము కింద గ్రామ, నగర పంచాయితీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు సెస్ వసూలు చేస్తున్నా యి. కానీ ఈ నిధులు గ్రంథాలయ సంస్థకు అందజేయడం లేదు. ఒక్క కర్నూలు నగరపాలక సంస్థ నుంచి రూ. 7.73 కోట్లు రావాల్సి ఉంది. అధికారులు గ్రంథాలయాల పురోభివృద్ధిపై దృష్టి పెట్టి లైబ్రరీ సెస్ నిధులు విడుదల చేయాలని కోరుతున్నాం. **- కె.ప్రకాశ్, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, కర్నూలు**

## నేటి నుంచి వారోత్సవాలు

కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ నవ్య వారోత్సవాలు ప్రారంభిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 58 శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ఆరంభిస్తున్నారు. ఈనెల 20 వరకు జరిగే ఈ వారోత్సవాల్లో 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శనలు, అవగాహన సదస్సు, 16న గ్రంథాలయ యోధులపై ప్రముఖుల ప్రసంగాలు, 17న కవి సమ్మేళనం, సదస్సులు, రచయితల అభిప్రాయాలు, 18న విద్యార్థులకు ప్రతిభా పోటీలు, ఆటల పోటీలు, 19న మహిళలకు విభిన్న రకాల పోటీలు, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, సామూహిక స్వీయ పఠనం, బహుమతుల ప్రదానం, ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నారు.

# కాసుల కోసం గోదాములు..!


(5వ పేజీ తరువాయి)


వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఇలాంటి పనులే ఎక్కువగా చేసిందని, ఏమాత్రం ముందుచూపు లేకుండా వ్యవహరించటంతో రైతులకు మేలు జరగలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చేందుకు..

గోదాముల నిర్మాణాలను పరిశీలిస్తే వాటికి పట్టుమని రూ.20 లక్షల ఖర్చు కూడా ఉండదు. కానీ 500 మెట్రిక్ టన్నుల నిలువ చేసే గోదాము నిర్మాణానికి రూ.45 లక్షలు, 1000 మెట్రిక్ టన్నులు నిలువ చేసే గోదాము నిర్మాణానికి రూ.75 లక్షలుగా నిర్ణయించి అప్పటి వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు కట్టబెట్టింది. కాంట్రాక్టర్లు పూర్తిగా డబ్బును దండుకోవటమే పనిగా పెట్టుకుని నాణ్యతకు కూడా తిలోదకాలిచ్చారు. కట్టిన కొన్ని రోజులకే వాటి నిర్మాణాలకు పగుళ్లు రావటమే కుకుండా, కింద ఫ్లోరింగ్ పెచ్చులు లేచిపోతున్నాయి. వెరసి గోదాముల నిర్మాణాలు కాంట్రాక్టరుకు డబ్బులు, రైతులకు తిప్పలు మిగిల్చాయే తప్ప ఏమాత్రం ఉపయోగం లేకుండా పోతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రుద్రవరం మండలం ఆర్.నాగులవరం, టి.లింగందిన్నె గ్రామాల రైతుల కోసం కొండపైన గోదాము నిర్మాణం చేపట్టారు. ఈ గోదాము ఇప్పటికీ పూర్తి కాలేదు. బనగానపల్లె నియోజకవర్గం టంగుటూరు సొసైటీ పరిధిలోని ఆరు గ్రామాల రైతుల కోసం గోదాము నిర్మాణం చేపట్టినా ముందుకు సాగలేదు. ఇలా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన గోదాముల నిర్మాణాలు ముందుకు సాగలేదు. కాంట్రాక్టర్లు కట్టిన వాటికి బిల్లులు చెల్లిస్తేనే పనులు పూర్తి చేస్తామని చెప్పటంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి.

### పిడికెడు ధాన్యం నిల్వ చేయలేదు : రసూల్, చందలూరు



గత వైసీపీ ప్రభుత్వం గోదాము నిర్మాణం చేపడుతుం దనగానే మా పంట ఉత్పత్తులు నిలువ చేసుకోవచ్చని సంబర పడ్డాం. కానీ దానివల్ల ఎలాంటి ఉపయోగం లేదని నిర్మాణం పూర్తైన తర్వాత గానీ తెలిసి రాలేదు. దారి ఏర్పాటు చేయకుండానే గోదామును నిర్మించారు. ఇప్పటి వరకు పిడికెడు ధాన్యం కూడా నిలువ చేయలేదు. ఇలాంటి నిర్మాణం ఎవరినీ బాగు చేయడానికి కట్టారో అప్పటి వైసీపీ ప్రభుత్వానికే తెలియాలి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టి సారించి రైతులు ఉపయోగించుకునేలా అందుబాటులోకి తీసుకురావాలి.

### అసంపూర్తిగానే ఉంది : జనార్దన్, సీఈఓ, పెద్దకంబలూరు సొసైటీ

పెద్దకంబలూరు సచివాలయ పరిధిలోని పందిళ్లపల్లె గ్రామ పరిధిలో గోదాము నిర్మించారు. ఈ గోదాము పనులు అసంపూ ర్తిగానే ఉన్నాయి. అసంపూర్తి గోదాము నిర్మా ణంపై రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి వచ్చే ఆదేశాలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయి.

### 45 గోదాములు అప్పగించారు

జిల్లాలో 255 రైతులకు బహుళ ప్రయోజనార్థం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గోదాములు నిర్మాణం చేపట్టింది. వీటిలో 500 మెట్రిక్ టన్నులు, వెయ్యి మెట్రిక్ టన్నులు సామర్థ్యం గల గోదాములు ఇప్పటి వరకు 45 గోదాములు పూర్తయ్యాయి. ఇంకా 210 గోదాముల నిర్మాణాలు పూర్తి కాలేదు. కాంట్రాక్టరు పూర్తి చేసిన వెంటనే రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

**- వెంకటసుబ్బయ్య, జిల్లా కోఆపరేటివ్ అధికారి, నంద్యాల**



# ఏజెన్సీ ఉద్యోగి చేతివాటం

విధుల నుంచి తొలగింపు

**మహానంది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** మహానంది క్షేత్రంలో పెద్దనంది విగ్ర హం వద్ద విధులు నిర్వహి స్తున్న ఏజెన్సీ ఉద్యోగి పావని భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి టిక్కెట్టు ఇవ్వడం లేదనే ఫిర్యాదులు రావడంతో విధుల నుంచి తొలగించినట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఒక్కొక్కరికి ప్రవేశం కోసం రూ.10 వసూలు చేసి టిక్కెట్టు ఇచ్చేందుకు ఏజెన్సీ ప్రతి పాదకన పావనిని నియమించారు. అయితే కొద్ది రోజుల క్రితం సదరు ఉద్యోగి భక్తుల నుంచి డబ్బు వసూలు చేసి టిక్కెట్టు ఇవ్వలేదని ఫిర్యాదు రావడంతో ఆమెను శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్లు ఈవో పేర్కొన్నారు.



# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషాద్రి

**సి.బెళగల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషాద్రి అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయం ఎంపీఎం రమేష్ అధ్యక్షతన చట్టాలపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ మహిళలకు చట్టాలపై అవగాహన లేకపోవడవంతో వేధింపులకు గురవుతున్నారని అన్నారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోడానికి మండల కేంద్రాలలో ప్రత్యేకంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళా కమిషనర్ హేమలత, ఐసీడీఎస్ సీడీపీవో వరలక్ష్మి, వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటస్వామి, ఎస్ఐ తిమ్మారెడ్డి, ఎంపీడీవో రాణెమ్మ ఉన్నారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.



కస్తూర్బా పాఠశాలలో భోజనాన్ని రుచి చూస్తున్న వెంకటశేషాద్రి



# 'వైసీపీ హయాంలోనే యురేనియం అనుమతులు'



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

**కర్నూలు అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** గత వైసీపీ ప్రభుత్వం యురేనియం తవ్వకాల కోసం సర్పంచుల తీర్మానాలతో తవ్వకాలకు అనుమతులు ఇచ్చిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ ఛైర్మన్లు బొజ్జమ్మ, దేవేంద్రప్పతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ యురేనియంపై కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. దేవనకొండ మండలంలో బంగారు గనులసర్వే పేరుతో 2019లో వైసీపీ ప్రభుత్వం యురేనియం తవ్వకాలకు అనుమతి ఇచ్చిందన్నారు. ఓటమి పాలైన తర్వాత వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, జేమ్స్, పోతురాజు రవి, చంద్రకాంత్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# సాయి ఈశ్వరుడి హత్య కేసు కొట్టివేత

**నందికొట్కూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** నందికొట్కూరు మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ సాయి ఈశ్వరుడు హత్య కేసును కొట్టివేస్తూ విజయవాడ ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో బైరెడ్డి రాజశేఖర్, అలాగే బైరెడ్డి సిద్దార్థరెడ్డిలతో పాటు మరో ఏడుగురు ఈ కేసు నుంచి బయటపడ్డారు. పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన సాయి ఈశ్వరుడు 2014 మార్చిలో కర్నూలులోని శకుంతల కల్యాణ మండపం సమీపంలో హత్యకు గురయ్యారు. ఆయన కుమారుడు బాలకృష్ణ 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చికెన్‌బాషా, బోయ మద్దిలేటి, పూడూరు రామకృష్ణ, బోయ నాగరాజు, బైరెడ్డి సిద్దార్థరెడ్డి, బైరెడ్డి శేషశయనారెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వడ్డె విజయ్, సద్దాం హుస్సేన్, వినోద్ కుమార్, వడ్డె అంజి, శ్రీనివాసులు, సురేంద్రబాబు, రాఘవేంద్ర రెడ్డిలపై కేసు నమోదైంది. సుదీర్ఘకాలంగా విజయవాడ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరుగుతూ వచ్చింది. 14 మంది నిందితులు కాగా, అందులో శ్రీనివాసులు, సురేంద్రబాబు పేర్లు డిశ్చార్జి పిటీషన్‌లో తొలగించగా, ఇప్పటికే నాగరాజు, బైరెడ్డి శేషశయనారెడ్డి, వడ్డె విజయ్ అనారోగ్యంతో మృతి చెందారు. సరైన సాక్ష్యాధారాలు నిరూపణ కాకపోవడంతో ఆధారాలు లేవంటూ మిగిలిన 9 మందిపై కేసును కొట్టి వేస్తూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసుపై బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి విజయవాడలో స్పందిస్తూ న్యాయం గెలిచిందన్నారు.

## టీడీపీలో చేరిక



మాండ్ర శివానందరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

**నందికొట్కూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో నాగటూరు గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. బుధవారం అల్లూరు గ్రామంలోని మాండ్ర శివానందరెడ్డి నివాసంలో నాగటూరు గ్రామ నాయకుడు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నాగటూరు గ్రామ వైసీపీ ఉప సర్పంచ్ హుసేనయ్య, వార్డు సభ్యులు చింతామణి, ఏసన్న, నాయకులు చిన్న ఏసు, మునిస్వామి, మత్తయ్య, వెంకటేశ్వర్లు, సుశీలమ్మ, మేరమ్మ, ఈశ్వరమ్మ, మరియమ్మ, జాషువా, బిచ్చాలు, ప్రభాకర్, నరసింహుడు తదితరులు టీడీపీలో చేరారు.

## నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్: ఎస్పీ

**నంద్యాల క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరనివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా బుధవారం తెలిపారు. జిల్లాలో అన్నిపోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మట్కా, జూదం, అక్రమ మద్యం, డ్రంకెన్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ వెహికల్ యాక్ట్‌ను కట్టుదిట్టంగా అమలు చేయడంతోపాటు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 35కేసులు నమోదు చేసి 14 వాహనాలు సీజ్ చేశారన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో 120ఓపెన్ డ్రింకింగ్ కేసులు, ఎంవీఐ ఆక్ట్‌తో 663 కేసులు నమోదు చేసి రూ.2.57లక్షల జరిమానా విధించారని చెప్పారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సమాజంలో ఆడపిల్లలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై, ఏదైనా ఆపద సమయంలో డయల్ 100, 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని తక్షణమే పొందాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడినవారు 1930కి ఫోన్‌చేసి సహాయం పొందాలని పేర్కొన్నారు.

## యువతి ఆత్మహత్య

**వెలుగోడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** వెలుగోడులోని ఎస్సీ కాలనీకి చెందిన జిల్లెల పుష్ప(19) మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ విష్ణునారాయణ తెలిపారు. ఎస్సీ కాలనీకి చెందిన పుష్ప ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. యువతి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

**నంద్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** క్రీడా భారతి ఆధ్వర్యంలో నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాలలోని ఆర్‌కే బ్యాడ్మింటన్ అకాడమీలో బుధవారం నుంచి జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడా భారతి రాయలసీమ జోన్ చైర్మన్, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. క్రీడాభారతి జిల్లా అధ్యక్షుడు సుధాకర్, హేమంత్‌రెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అందని శుద్ధజలం

● మూలన పడ్డ యంత్రాలు ● బోరు నీటినే తాగుతున్న వైనం



బోరు నీటిని తాగుతున్న విద్యార్థులు



పని చేయని యంత్రం

**పాములపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అదించి వారి ఆరోగ్యం బాగుండాలన్న లక్ష్యంతో లక్షల రూపాయలు వెచ్చించి గ్రామాలలోని పాఠశాలలో శుద్ధజలాల యంత్రాలను ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణ సరిగా లేక పోవడంతో మిషన్లు ఏడాదికి పైగా మూలన పడటంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు లేక బోరు, ట్యాంకులలోని పాచినీరు వినియోగిస్తున్నారు. పాములపాడులోని ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మద్దూరు ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు మరికొన్ని గ్రామాలలో శుద్ధ జలం అందించడానికి యంత్రాలు ఏర్పాటు చేసింది. అయితే గత ఏడాది నుంచి అవి పని చేయడం లేదు దీంతో ప్రత్యామ్నాయంగా బోరు నుంచి పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని ట్యాంక్‌ను ఏర్పాటు చేసి అందులోకి సరఫరా చేస్తున్నారు. ఈ నీటినే విద్యార్థులు తాగుతున్నారు. ఈ ట్యాంక్‌ను శుభ్రం చేయకపోవడంతో దుమ్ము, ధూళి పేరుకపోయిన నీటినే విద్యార్థులు వినియోగించాల్సి వస్తోంది. నాడు-నేడు పనుల్లో లక్షల రూపాయలు వెచ్చించి నూతనంగా కొళాయిలు నిర్మించారు. వాటికి పైపులైన్ ఏర్పాటు చేసినా పలు సమస్యల వల్ల పట్టించుకోకపోవడంతో విద్యార్థులు వాటిని వినియోగించుకోవడం లేదు. పాత బోర్లనే తాగునీటి కోసం ఆశ్రయిస్తున్నారు. ఈ విషయంపై హెచ్‌ఎం గోపాల్‌ను వివరణ కోరగా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామని, నిధులు మంజూరు కాగానే రిపేరు చేయించి విద్యార్థులకు తాగునీటిని అందిస్తామని తెలిపారు.



ట్యాంకు లోపలి భాగంలో దుమ్ము, ధూళి , పాచి ఉన్న దృశ్యం



వినియోగంలో లేని కొళాయిలు

# ఆసుపత్రి నిర్వహణ తీరుపై కలెక్టర్ ఆగ్రహం



మద్దూరు ఆసుపత్రిలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

**పాణ్యం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** మండలంలోని మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పనితీరుపై కలెక్టరు రాజకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ, ప్రసవాల రికార్డులను మెడికల్ అధికారి డాక్టర్ సునీతను అడిగి తెలుసుకున్నారు. మందుల స్టాక్, ఇతర రికార్డులు పరిశీలించి పనితీరు సరిగా లేదని, వెంటనే పనితీరు మెరుగుపర్చు కోవాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారిని ఆదేశించారు. కాలం చెల్లిన మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసిస్టు పనితీరు సరిగా లేదని క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో ఉన్న చెత్తను తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డాక్టర్ సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టరు మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్య నందించాలని ఉపాధ్యాయుల ను ఆదేశించారు. ఇంటింటికి తిరిగి బడిఈడు పిల్లలను గుర్తించి నమోదు చేయించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పాఠశాల మైదానం, తరగతి గదులు, చుటు ప్రక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశిం చారు. మనబడి మన భవిష్యత్తు కింద చేపట్టిన పాఠ శాల భవనాల నిర్మాణాల పనులను పరిశీలించారు. పాఠశాలకు హాజరైన విద్యార్థుల సంఖ్యను, పాఠ్యపుస్త కాలు, మరుగు దొడ్ల నిర్వహణ, తాగునీటి వసతి తదితర మౌలి క సదుపా యాల గురించి అడిగి తెలుసు కున్నారు.

**నంద్యాల రూరల్:** ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యతగా చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు.

## 18న జాబ్‌మేళా

**ఆత్మకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18వ తేదిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగించుకోవాలని ఆ సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే ఈ జాబ్‌మేళాకు పలు ప్రైవేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తిచేసిన 18 నుంచి 45ఏళ్ల వయసు గల అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు హాజరు కావచ్చునని చెప్పారు. మరిన్ని వివరాలకు 6303244165, 7673902328 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## 'సర్వే సకాలంలో పూర్తి చేయాలి'

**వెలుగోడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** మండలంలో చేపట్టిన జియో ట్యాగింగ్ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బంది చేపట్టిన సర్వేలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. బుదవారం వేల్పనూరు. రేగడగూడూరు గ్రామాలలో తనిఖీ నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు

## మూడో రోజు కొనసాగిన ప్రజాపోరు యాత్ర

**ఆత్మకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర మూడో రోజు బుధవారం ఆత్మకూరు పట్టణంలో కొనసాగింది. పట్టణంలోని వాకిటిపేట, రాజావీధి, గొల్లపేట, వడ్లపేట, కొత్తపేట మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు సాగింది. ఆ పార్టీ నాయకులు రాజశేఖర్, ఏసురత్నం, రణధీర్, రజాక్‌లు మాట్లాడుతూ.. వివిధ డిమాండ్ల సాధనకై నవంబరు 14న తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, ఇస్మాయిల్, సద్దాం హుసేన్, భాస్కర్, ముర్తుజా, సామేలు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆయిల్ పామ్ సాగు లాభదాయకం'

**పాములపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని జిల్లా ఉద్యానవన అధికారి నాగరాజు అన్నారు. మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో బుధవారం ఆత్మకూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఆంజనేయ, నంద్యాల సెరికల్చర్ డీడీ పరమేశ్వరి, ఏడీ నాగేశ్, పతాంజలి కంపెనీ ఏజీఎం రామకృష్ణ, జిల్లా మేనేజర్ మహదేవ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మొక్కల సాగు, లాభాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక రైతు పొలంలో ఐదెకరాలలో ఆయిల్‌పాం మొక్కలను నాటారు.

## నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

**ఆత్మకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** ఈ నెల 14 నుంచి 20వ తేది వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి రాజేష్ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తామని చెప్పారు.

**పగిడ్యాల:** గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి మద్దమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ పగిడ్యాల గ్రంథాలయంలో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**గడివేముల:** మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు ఉంటుందని అన్నారు.

## మహానందిలో ప్రముఖుల పూజలు

**మహానంది, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** మహానంది క్షేత్రంలో బుధవారం పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిలో అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు దంపతులతో పాటు నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వేర్వేరుగా ప్రధాన ఆలయాల్లో కార్తీకమాసం పురష్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణమంటపంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌ఎస్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేదపండితులు ఆశీర్వదించి, మెమెంటో బహూకరించారు. వీరివెంట పంచాయతీ కార్యదర్శి నాగసంజీవరావు ఉన్నారు.

## 'నందుల ప్రదక్షిణను విజయవంతం చేయాలి'

**నంద్యాల కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** కార్తీక పౌర్ణమి పురష్కరించుకొని ఈనెల 15 న నిర్వహించే నందుల ప్రదక్షిణను విజయవంతం చేయాలని మన ఊరు మన గుడి మన బాధ్యత ప్రముఖులు పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాల పట్టణంలో ముద్ర ఫర్ నంది అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు శివకుమార్‌రెడ్డి, యాడికి శ్రీదేవితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

**గడివేముల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, నాగన్న డిమాండ్ చేశారు. గడిగరేవుల హైస్కూల్‌లో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2023 జూలై 23 నుంచి నూతన పీఆర్సీ అమలు కావాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వం స్పందించి పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. అంతవరకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించి అమలు చేయాలన్నారు. ఏపీజీఎల్‌ఐ ఫైనల్ మెచ్యూరిటీ మొత్తాలను, ఆర్జిత సెలవుల నగదును ఉపాధ్యాయుల ఖాతాలో జమ చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను, వివిధ రకాల యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌లను పరిష్కరించకపోతే ప్రభుత్వ వైఖరికి నిరసనగా డిసెంబరు 16, 17 తేదీల్లో జిల్లాస్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఏపీటీఎఫ్ నాయకులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వయోజన విద్యా వలంటీర్లకు శిక్షణ

**పగిడ్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** పగిడ్యాల వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం పై ఎంపీడీవో సుమిత్రమ్మ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంఈవో మురళీమోహన్ రెడ్డి, వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఏపీఎం కళావతి, మండల సమాఖ్య సభ్యులు ఉన్నారు.

**మిడుతూరు:** మిడుతూరు వెలుగు కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో దశరథరామయ్య, ఏపీఎం సుబ్బయ్య ఆధ్వర్యంలో ఉల్లాస్ వయోజన విద్యా వలంటీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వయోజన విద్య సూపర్‌వైజర్ నెమలయ్య మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దడానికి ఉల్లాస్ వయోజన విద్య కార్యక్రమం తోడ్పడుతుందని అన్నారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారికి అర్థం అయ్యేలా చదువు నేర్పించడం ఇందులో ప్రధానం అని ఆయన అన్నారు. ఉల్లాస్ వయోజనలో కుటుంబం, ఆరోగ్యం, పరిశుభ్రత, ఎన్నికలు, పిలల్ల పెంపకం, చట్టాల పట్ల అవగాహన కల్పించాలని వలంటీర్లరు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి, సీఆర్పీ రమణ, సీసీలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల పరిశీలన



మిడుతూరులో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ

**మిడుతూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** మిడుతూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లను పీఆర్ ఈఈ రఘురామి రెడ్డి బుధవారం పరిశీలించారు. రోడ్ల నాణ్యత ప్రమాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈఈ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో నాణ్యతలోపించకుండా ఉండాలని ఏఈ ప్రతాప్ రెడ్డికి సూచించారు. ఆయన వెంట డీఈ గణిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యోగి ఉన్నారు.

## బంగారు గొలుసు అప్పగింత

**నంద్యాల క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** రైలులో ప్రయాణించే సమయంలో శేఖర్ అనే వ్యక్తి తన మెడలోని 3 తులాలకు పైగా ఉన్న బంగారు గొలుసును పోగొట్టుకొని రైల్వే పోలీసులను ఆశ్రయించాడు. దీంతో వారు సదరు గొలుసును రైలులో గుర్తించి బాధితుడికి బుధవారం అందజేశారు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణా నికి చెందిన శేఖర్ ఈ నెల 11న పాలకొల్లు నుంచి కంభం వెళ్లడానికి అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలులో రిజర్వేషన్ చేయించుకున్నాడు. రైలులో ప్రయా ణిస్తుండగా అతడి మెడలోని బంగారు గొలుసు పడిపోయింది. విషయం గమనించకుండా రైలు కంభం చేరుకోగానే దిగి ఇంటికి వెళ్లారు. ఇంట్లో తన మెడలో బంగారు గొలుసు లేకపోవడాన్ని గమనించి కంభం రైల్వే స్టేషన్ చేరుకొని నైట్‌బీట్‌లో ఉన్న నరేశ్‌ను సంప్రదించారు. ఆర్పీసీ సదరు ట్రైన్‌కు బీట్ డ్యూటీలో ఉన్న కె.సూర్యప్రకాశ్ రావు, ఎస్.సలీంబాషాకు ఫోన్ ద్వారా తెలపగా వారు వెళ్లి వెతకగా బంగారు గొలుసు దొరికింది. ఆ గొలుసును బుధవారం నంద్యాల జీఆర్‌పీఎస్ ఎస్ఐ ఎస్.అబ్దుల్ జలీల్ బాధితుడు బొడ్డు రాజశేఖర్‌కు అందజేశారు.

## 'పంట మార్పిడితో భూమి సారవంతం'



వడ్డెమానులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

**నందికొట్కూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** రబీ కాలంలో ముఖ్యంగా రైతులు పంట మార్పిడి చేసుకోవాలని, అలాగే అపరాల సాగుతో భూమి సారవంతం అయ్యి అధిక దిగుబడులు పొందవచ్చునని ఏడీఏ విజయ శేఖర్, ఏవో షేక్షావలి రైతులకు సూచించారు. నందికొట్కూరు మండలంలోని వడ్డెమాను గ్రామంలో బుధవారం ఏడీఏ విజయశేఖర్ ఆధ్వర్యంలో ఏవో షేక్షావలి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రుడు, రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా కొనసాగుతున్న కార్తీక మాసోత్సవాలు

**శ్రీశైలం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం పురష్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తభం వద్ద ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానంలో అఖండ శివ భజనలు నిర్వహిస్తున్నారు.

● శ్రీశైల క్షేత్రంలో బుధవారం త్రయోదశి ఘడియలను పురస్కరించుకొని సాయంప్రదోషకాలంలో ఆలయంలోని మల్లికార్జునస్వామికి అభిముఖంగా కొలువైవున్న నందీశ్వర స్వామికి పరోక్ష సేవగా విశేష అభిషేకం, అర్చనలు జరిపించారు. లోక కల్యాణార్థం సాక్షి గణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం సాయంత్రం విజయవాడకు చెందిన గాయత్రి నృత్య నికేతన్ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

**మహానంది:** మహానంది క్షేత్రంలో బుధవారం కార్తీక సందడి నెలకొంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాదిమంది భక్తులు మహానందీశ్వరుడి దర్శనం కోసం తరలివచ్చారు. ఆలయం ముందు భాగంలోని సుపతి మంటపాల పరిసరాలతో పాటు ప్రధాన రాజగోపురం వద్ద కోటి దీపోత్సవంను జరిపేందుకు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్, పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్ల పనులను పర్యవేక్షించారు.

**వీరబ్రహ్మేంద్రస్వామికి పట్టు వస్త్రాలు**

మహానంది దేవస్థానం నుంచి సంప్రదాయం ప్రకారం కడప జిల్లా కందికాయపల్లె లోని బ్రహ్మంగారి మఠంలో జరిగే పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణానికి ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల్ల మధు బుధవారం పట్టు వస్త్రాలు తీసుకెళ్లారు. పట్టు వస్త్రాలను అర్చకులకు అందించారు. పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, ఉప ప్రధాన అర్చకులు శంకరయ్య, మామిళ్ళపల్లి రాఘవశర్మ, సుబ్బయ్యశర్మ పాల్గొన్నారు.



శ్రీశైలంలో ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న అధికారులు



బ్రహ్మంగారి మఠంలో పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మహానంది ఆలయ ఈవో, ఏఈవో

## ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకోవచ్చు



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

**కోవెలకుంట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :** ఏడాదికి శనగపంట మాత్రమే సాగు చేస్తున్నారని అలా కాకుండా శనగ పంటకు ముందు కొర్ర, మినుము, పెసర పంటలు సాగు చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. బుధవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని గుంజలపాడు గ్రామంలో వ్యవసాయాధికారి నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల వ్యవసాయ సిబ్బంది, కంపమల్ల, భీమునిపాడు గ్రామ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో తులసి పూజలు

**చాగలమర్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా బుధవారం వేద పండితుడు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో తులసి మాతకు మహిళలు సామూహికంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తులసిచెట్టుకు 108 దీపాలతో ప్రత్యేక హారతులు ఇచ్చారు. తులసిమాత విశిష్టత గురించి తెలియజేశారు. అనంతరం విష్ణుసహస్ర పారాయణం, శివపార్వతులకు పూజలు చేశారు. ఆలయ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.















# శిథిలమవుతున్న ఆలయం

- గుప్తనిధుల కోసం విగ్రహాల ధ్వంసం
- మూడు మండలాల్లో మాన్యం
- అయినా పునరుద్ధరణకు నోచుకోని వైనం
- పురాతన వేణుగోపాలస్వామి ఆలయం దుస్థితి

**రుద్రవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని పలు గ్రామాల్లోని పురాతన ఆలయాల్లో గుప్తనిధుల కోసం విగ్రహాలను ధ్వంసం చే సున్నారు. మండలంలోని బీరవో లులో పురాతన వేణుగోపాల స్వా మి ఆలయానికి లక్షల్లో ఆదాయం ఉన్నా ధూపదీప నైవేద్యానికి నోచుకోవడం లేదు. ఇదే అదునుగా భావించిన దుండగులు గుప్తనిధుల కోసమని వేణుగోపాలస్వామి విగ్రహాన్ని పెకలించారు. మిగిలిన విగ్రహాలను ధ్వంసం చేశారు. మాన్యం భూములు ఉన్నా ఆలయం మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. బీరవోలు వేణుగోపాలస్వామి ఆలయానికి మాన్యం రుద్రవరం, మహానంది, నంద్యాల మండలాల్లో ఉ న్నది. 42 సర్వేనెం బ రులో 10.82, 170 లో 4.50, 281 లో 7.02, 241 /1లో 2.39 ఎకరాల మా న్యం ఉన్న ది. 2023 మే 18 న భూములను వేలం నిర్వహించ గా రూ.2లక్షల 80వేలు ఆదాయం వచ్చింది. మొత్తం ఆదాయాన్ని ధూపదీప నైవేద్యాలకే ఖర్చు చేస్తున్నట్లు చూపుతున్నారే తప్ప ఆలయాన్ని అభివృద్ధి చేయకపోవడం గమనార్హం. ఎన్నికల ముందు వైసీపీ ప్రజాప్రతినిధులు హడావుడి చేశారు. నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కానీ దేవాలయం పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఈవో వేణునాథరెడ్డిని వివరణ కోరగా నూతన దేవాలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.



బీరవోలులో శిథిలావస్థలో వేణుగోపాలస్వామి ఆలయం



గుప్తనిధుల కోసంలో వేణు గోపాలస్వామి ఆలయంలో పెకలించిన విగ్రహం



పెకలించిన అమ్మవారి విగ్రహం



పగిలిపోయిన పురాతన విగ్రహాలు

# వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం : డీఈవో

**చాగలమర్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యమని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం చాగలమర్రిలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను, పాఠశాల పరిసరాలను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి ఉంచామని అన్నారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వంలోని నాడు-నేడును మనబడి-మన భవిష్యత్తుగా పేరు మార్చి పాఠశాలలను తీర్చుదిద్దుతామని అన్నారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణతో ఉపాధ్యాయులు ఇబ్బందికరంగా మారడంతో దూర ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లా కేంద్రంలోనే నిర్వహించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నట్ల తెలిపారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు అధికంగా ఉంటే వారిని విద్యార్థులు అధికంగా ఉన్న చోటికి సర్‌ప్లస్ ద్వారా బదిలీ చేయడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో న్యామతుల్ల, ఇన్‌చార్జి హెచ్ఎం శాస్త్రీ, పాఠశాల కమిటీ చైర్మన్ గౌస్‌మొద్దిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

## జుర్రేరు వాగు ఆక్రమణలపై రీ సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**బనగానపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె పట్టణంలోని జుర్రేరువాగు ఆక్రమణలపై బుధవారం అధికారులు రీ సర్వే నిర్వహించారు. జుర్రేరు వాగుకు ఆనుకొని ఉన్న బఫర్‌జోన్‌ను బీవీ.సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్ యజమానులు స్థల ఆక్రమించుకున్నట్లు గుర్తించిన కుడా అధికారులు, మండల సర్వేయర్లు , మైనర్ ఇరిగేషన్ అధికారులు బుధవారం రీసర్వే చేశారు. కొంత భాగం ఆక్రమణలకు గురైనట్లు రీసర్వేలో గుర్తించి మార్కింగ్ వేశారు. మండల సర్వేయర్ గాయత్రి, మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి, సర్వేయర్ హుసేని, కూడా సిబ్బంది ఈసర్వేలో పాల్గొన్నారు. ఉన్నతాధికారులకు రీసర్వే వివరాలను పంపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే జుర్రేరువాగుకు అనుకొని ఉన్న బఫర్‌జోన్ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ప్రజా ఫిర్యాదుపై రీ వెరిఫికేషన్

**ఉయ్యాలవాడ, నవంబరు 3:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదుపై రీ వెరిఫికేషన్ చేస్తున్నామని హౌసింగ్ డీఈ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఉయ్యాలవాడ గ్రామంలోని పగిడాల ఓబులమ్మ కుమారుడు కొండయ్యను కలిసి వారు ఇచ్చిన ఫిర్యాదుకు సమాధానం ఇచ్చారు. కాగా, ఉయ్యాలవాడ ఇన్‌చార్జి ఇంజనీరింగ్ అసిస్టెంటుకు కలెక్టర్ రాజకుమారి మెమో జారీ చేసినట్లు డీఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఫిర్యాదుదారుల అర్జీలకు అసంపూర్తి నివేదికను అప్‌లోడ్ చేసినందుకు మెమో జారీ చేశారన్నారు. దీనిపై మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమమహేశ్వవారు, ఏఈ నరసింహరావు, డీ సుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

**రుద్రవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఈఈ హరిగోపాల్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో 924 గృహాలు మంజూరు కాగా వీటిలో 630 గృహాలు పూర్తి అయ్యాయన్నారు. 119 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 521 గృహాలు మంజూరు కాగా వీటిలో 135 గృహాల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయన్నారు. 85 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. డిసెంబరు 31లోగా పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఈ నాగరాజు, ఏవో సుబ్రహ్మణ్యం, ఏపీవో ప్రతాప్, ఆనంద్, ప్రసాద్ పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణే ధ్యేయంగా పని చేయాలి

**ప్యాపిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** నేరాల నియంత్రణే ధ్యేయగా పని చేయాలని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన ఎస్ఐలతో క్రైమ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మండలంలో పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలు లేకుండా చేయాలన్నారు. గ్రామాల్లో పర్యటించి నాటుసారా, గంజాయి అమ్మకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదల నివారణకు తగు అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించి ఇరువర్గాల వారు గొడవలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సీఐ సూచించారు. సమావేశంలో ప్యాపిలి, జల దుర్గం, రాచెర్ల ఎస్ఐలు మధుసూదన్, నాగార్జున, లక్ష్మణరావు పాల్గొన్నారు.

## బెల్టు దుకాణాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో మద్యం బెల్టు దుకాణాల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణం లోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవా రం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో మద్యం బెల్ట్ దుకాణాలకు సంబంధించి ఇప్పటి వరకు 77 కేసు లు నమోదు చేశామన్నారు. నాటు సారా, మద్యం రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆళ్లగడ్డ ఎక్సైజ్ శాఖ పరిధిలోని 19 మద్యం దుకాణాలకు చెందిన లైసెన్సుల వివ రాలను ఆమె తెలుసుకున్నారు. నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం విక్ర యదారుల వివరాలను సేకరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్ర మంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు, సీఐ విజయ్ కుమార్, ఎస్ఐలు సరస్వతి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

## 90 రోజుల పని దినాలు వేగవంతం చేయాలి

**చాగలమర్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల గృహాలకు 90 రోజుల పని దినాలు వేగవంతం చేయాలని ఏపీడీ సాంబశివరావు సూచించారు. బుధవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ ఏల సమావేశం నిర్వహించారు. మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. కూలీలకు వంద రోజులు పని దినాలు కల్పించేలా పనులు గుర్తించాలని అన్నారు. మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని అన్నారు. పండ్ల తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

**దొర్నిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని దొర్నిపాడు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సావిత్రి తెలిపారు. శిక్షణా తరగతులకు మండలస్థాయి అధికారులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి పథకం, పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులు తదితర శాఖల అధికారులు, సర్పంచ్‌లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని తెలిపారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** ద్విచక్ర వాహనాల దొంగను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవి కుమార్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన శెట్టి లక్ష్మీ కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా బైక్ దొంగతనాల విషయం బయటపడిందన అన్నారు. రూ.7.77 లక్షల విలువ చేసే ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ప్రజలు తమ వాహనాలను పార్కింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ చిరంజీవి, ఎస్ఐ నగీనా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు

**బేతంచెర్ల, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) :** దేశ వ్యాప్తంగా పెరుగుతున్న ధరలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం మూడవ మండల మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో మహాసభ అధ్యక్షులు వెంకటరమణ, నాయకులు రహంతుల్లా, నాగరాజు, ఎల్లయ్య, సుబ్బరాయుడు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బీసీ నాయకులకు కలిసిన నాగేశ్వరరావు యాదవ్

**డోన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :** అమరావతిలోని బీసీ సంఘం కార్యాలయంలో జాతీయ బీసీ సంఘం నాయకులను బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావుయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ క్రిష్ణయ్య, ప్రధానకార్యదర్శి బీదా రవిచంద్ర, ఐఏఎస్ క్రిష్ణయ్య తదితర నాయకులను కలిసి తనను ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడిగా నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పలువురు బీసీ, టీడీపీనేతలు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ పురాణం పుస్తకావిష్కరణ

**బనగానపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు పట్టణంలోని టీజీవీ లలిత కళాసమితిలో సెల్‌ఫోన్ పురాణం పుస్తకావిష్కరణ బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి హాజరై మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు సెల్ ఫోన్ వాడరాదన్నారు. ఇనయతుల్లా, మహమ్మద్‌మియా పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ రాజారెడ్డి తదితరులు

## ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా

- రవి కుమార్, డీఎస్పీ, ఆళ్లగడ్డ



**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 13(ఆంధ్రజ్యోతి) :** ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణపై ప్రత్యేకనిఘా ఉంచినట్లు డీఎస్పీ కే రవి కుమార్ తెలిపారు. మట్కా, పేకాట, మద్యం గొలుసు దుకాణాలు, దొంగతనాలు తదితర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేరప్రవృత్తి కలిగి.. గ్రామాల్లో గొడవలు సృష్టించేందుకు యత్నించే వారిని ఉపేక్షించబోమని డీఎస్పీ తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

**ప్రశ్న:** సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు:** సబ్ డివిజన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలను పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. అనుమానితుల ఇళ్లలో, ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నాం.

**ప్రశ్న:** సైబర్‌నేరాలపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

**జవాబు:** సైబర్ నేరాల నియంత్రణకు సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, లింక్‌లను డౌన్‌లోడ్ చేసుకోకూడదు. బ్యాంక్ ఓటీపీలు, ఏటీఎం కార్డులు, వాటి పిన్ వివరాలను ఎవరితోనే పంచుకోవద్దు.

**ప్రశ్న :** రహదారి ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

**జవాబు:** సబ్ డివిజన్‌లోని ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నాం. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధిస్తున్నాం. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేయకుండా, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

**ప్రశ్న :** విజిబుల్ పోలీస్, ఫ్రెండ్లీ పోలీస్ విధానాలు ఎలా కొనసాగుతున్నాయి?

**జవాబు :** సబ్ డివిజన్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. అలాగే స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించేలా చర్యలు చేపడుతున్నాం.

**ప్రశ్న :** యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు?

**జవాబు :** యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్‌లకు దూరంగా ఉండాలి. మత్తుపదార్థాలు, చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరిస్తున్నాం. యువతలో సామాజిక, సేవా భావన కలిగించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

## నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

**కోవెలకుంట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :** కోవెలకుంట్ల గ్రంథాలయంలో గురువారం నుంచి 20వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి బాలసింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14న బాలల దినోత్సవ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. వివిధ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## మహిళల అక్షరాస్యత అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేంద్రప్రసాద్

**చాగలమర్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** నిరక్షరాస్యులైన మహిళల అక్షరాస్యత అందరి బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో సెర్ప్ అడల్ట్ ఎడ్యూకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. సమాజంలోని అందరికి జీవితకాల అభ్యసన, అవగాహనపై మహిళా వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈవోఆర్డీ తాహిర్ హుసేన్, వెలుగు ఏపీఎం నాగమ్మ, వెలుగు సీసీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణకు కసరత్తు

**చాగలమర్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** ఆళ్లగడ్డ డివిజన్‌లోని టీజీపీ సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నామని టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని 15 సాగునీటి సంఘాలకు, 171 టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. సాగునీటి సంఘాల, టీసీలకు సంబంధించిన ఓటర్ల జాబితాను సంబంధిత రెవెన్యూ అధికారులకు సూచించామని అన్నారు. 33వ బ్లాక్ నుంచి 47వ బ్లాక్ వరకుగల డబ్ల్యూఎల్, టీసీలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. సమావేశంలో ఏఈ నాయక్ ఉన్నారు.

## అదుపు తప్పి కారు బోల్తా

- నలుగురికి గాయాలు

**చాగలమర్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని 40వ జాతీయ రహదారిపై గేదెలను తప్పించబోయి కారు రోడ్డు పక్కన ఉన్న గుంతల్లో బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. బుధవారం డోన్ నుంచి పుత్తూరు వెళ్తుండగా చాగలమర్రి గ్రామ సమీపంలో రహదారిపై వస్తున్న గేదెలను ఢీకొనడంతో రోడ్డు పక్కన ముళ్ల కంపల గుంతలో కారు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ సంఘటనలో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. కారులో ఉన్న వెంకటేశ్వర్లు, మునిలక్ష్మి, లీలా కృష్ణ, కవితలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 వాహనం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రమేష్‌రెడ్డి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సభ్యత్వ నమోదులో రికార్డు సాధించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి

**కొలిమిగుండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర మంత్రి బీసీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గం రికార్డు సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త వీఆర్ లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో విస్తృత సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు కార్యకర్తలు, నాయకులకు సభ్యత్వం ఇచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని, సభ్యత్వ నమోదుతో ప్రతి ఒక్కరికీ బీమా వర్తిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కనకాద్రిపల్లె గ్రామసర్పంచ్ శివశంకర్, వెంకటమల్లారెడ్డి, యూనిట్ ఇంచార్జి రవిప్రకాశ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, వడ్డె పెద్దరాజు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.